



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
మంగళవారం 1 జులై 2025 పేజీలు 8



## విగ్రహాలు పెడుతున్నారు సరే...

# నిగ్రహంగా ఉండగలరా..?

(విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్)

- పీడర్ రోడ్డులో వెలుస్తోన్న మహానేతల విగ్రహాలు
- పోటీకి పెడుతున్నారా? ప్రశంసల కోసం పెడుతున్నారా?
- అంగరంగ వైభవంగా ప్రారంభోత్సవాలు చేసేస్తున్నారు..
- మరి ఆ మహానేతల విగ్రహాల రక్షణ మాటేమిటి?
- జరగనున్న కోట్లాలకు మహానేతలు సాక్ష్యమవనున్నారా?
- వీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆంతర్యం ఏమిటి?

విగ్రహాలు ప్రతిష్టించి, దండలు వేసి, డప్పులు కొట్టి, సంబరాలు చేసుకునే సంస్కృతిని ఏనాడు ఎవరు ప్రారంభించారో తెలియదు కానీ.. విగ్రహాలను తమ రాజకీయ పురోభివృద్ధికి ఈ నాటికి మన నాయకులు వాడుకుంటూనే ఉన్నారు.. విగ్రహాలు పెట్టే ఈ ఆనవాయితీ దేశాలను దాటివెళ్లిన, విగ్రహాలు కోసం కొట్టుకునే దౌర్భాగ్యం మాత్రం మన ముంగిళ్లలోనే మనకు ఎప్పుడు తారసపడుతూనే ఉంది.. ఈ విగ్రహాలను మహనీయులను ఇప్పటి వారు గుర్తించేందుకు కొందరు నేతలు తమ స్వనిధులతో ఏర్పాటు చేస్తుంటే.. మరి కొందరు తమ రాజకీయ మనుగడను, తమ ఉనికిని కాపాడుకునేందుకు మహానేతల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.. విజయవాడ నగరపాలక సంస్థకు సంబంధించిన స్థలాలలో రోజుకో విగ్రహం పుట్టుకువచ్చి, అగ్రనేతలే ప్రారంభోత్సవాలు జరుపుతున్నాకూడా సంబంధిత అధికారులు మిన్నకుండిపోవడం నగర ప్రజలను ఆలోచించేలా చేస్తోంది...

### పీడర్ రోడ్డులో వెలుస్తోన్న మహానేతల విగ్రహాలు

నగరపాలక సంస్థ విజయవాడ నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తూనే ఉంది.. వారు చేసే అభివృద్ధి కల్లకు కట్టినట్టు నగరమంతా కనిపిస్తోంది..

మిగతా 2లో

## అందుబాటులో లేని... నందిగామ డివిజన్ విద్యాశాఖ అధికారి




వివరాలు 5లో...

## అమెరికాలో సిలికాన్ వ్యాలీ..

# అమరావతిలో క్వాంటం వ్యాలీ






- 2026 జనవరి 1 నాటికి అమరావతిలో క్వాంటం వ్యాలీ పార్క్
- క్వాంటం వ్యాలీకి అనుబంధంగా ఒక ఎకోసిస్టం ఏర్పాటు
- డీప్ టెక్నాలజీ, ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు ఏపీలో విస్తృత అవకాశాలు
- బహుళజాతి సంస్థలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి
- భవిష్యత్ టెక్నాలజీలను పాలనలో, ప్రజా జీవనంలో సమ్మిళితం చేయటమే నా లక్ష్యం
- అమరావతి క్వాంటం వ్యాలీ నేషనల్ వర్క్ షాప్‌లో సీఎం చంద్రబాబు నాయుడు
- నేషనల్ వర్క్ షాప్‌లో క్వాంటం కంప్యూటర్ ప్రోటోటైప్ ప్రదర్శన

7లో..

## ప్రభుత్వానికి ఎక్కువ పేరు తీసుకువచ్చిన అంశాల్లో రహదారుల అభివృద్ధి కూడా ఒకటి

8

# విగ్రహాలు పెడుతున్నారు సరే... నిగ్రహంగా ఉండగలరా..?



రాణిగారితోట గుడ్ మార్నింగ్ సెంటర్‌లో ఇటీవల అగ్రనేతలు ప్రారంభించిన దివంగత మహానేతలు బాబు జగజ్జీవన్‌రామ్, ఎన్టీఆర్, కృష్ణ విగ్రహాలు

(మొదటిపేజీ తరువాయి)

నేషనల్ హైవేకి పక్కన ఉన్న కృష్ణలంక ప్రాంతంలోని పలు డివిజన్లలో కూడా ఇదే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ప్రజలు ట్రాఫిక్ కు ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో ఫీడర్ రోడ్డును మరింత విస్తృతం చేస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించేలా నాణ్యమైన, ఖరీదైన పేవర్ బ్లాక్‌ల రాళ్లతో ఫుట్ పాత్‌ను కూడా వేయడం జరిగింది. అయితే వీఎంసీ స్థలమైన ఫీడర్ రోడ్డులో విగ్రహాలను ప్రతిష్టిస్తూ వస్తున్నా కొందరు స్థానిక నేతలు.. అయితే ఈ విగ్రహాలను అనుమతులు ఎవరైనా ఇస్తున్నారా ? అని ప్రశ్నిస్తే దానికి సమాధానం మాత్రం ఏ నేత వద్ద నుంచి కూడా రావడం లేదు.. ఒకప్పుడు భారీవాహనాలతో, నిండిపోయి ట్రాఫిక్‌కు విఘాతం కలిగితే.. ఇప్పుడు ఈ మహానేతల విగ్రహాల వలన, విగ్రహాలతో పాటు అక్కడ ప్రజలు కుర్చుని సేదతీరేందుకు వేసిన బల్లల వలన తరువాతి కాలంలో ట్రాఫిక్ కు విఘాతం కలిగే అవకావం అధిక శాతంలో ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### పోటీకి పెడుతున్నారా? ప్రశంసల కోసం పెడుతున్నారా?

అందరికి నచ్చిన, అందరికి మార్గదర్శకులుగా నిలిచిన నేతల విగ్రహాలను ఏర్పాటు చేయడం అందరికి మహదానందంగానే ఉంది.. కానీ వీఎంసీకి సంబంధించిన స్థలలాలో అనుమతులు లేకుండా విగ్రహాలు నెలకొల్పడం ఎవరి కోసం.. తమ తోటి నేతలతో పోటీకి ఈ విగ్రహాలను అత్యంత భారీగా, అధిక మొత్తంలో ఖర్చుపెడుతున్నారా.. ? లేదా తమకు అగ్రనేతలు, తమ తోటి నాయకుల ప్రశంసల కోసమా అని విగ్రహాలు ప్రతిష్టిస్తున్న నేతలు ఆలోచించుకోవాలసిన అవసరం ఎంతైనా ఉంది.

### విగ్రహాలు పెడుతున్నారు సరే... మరి నిగ్రహంగా ఉండగలరా..?

విగ్రహాల ఏర్పాటు, వాటిని అంగరంగా వైభవంగా ప్రారంభించేస్తున్నారు.. కానీ వాటి ఆలనా పాలనా ఎవరు చూస్తారు.. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఆ విగ్రహాలకు ఏమైనా జరిగితే తరువాతి పరిణామాలేంటి.. విగ్రహాలు ఏర్పాటు చేసిన వారే ఆ పరిణామలను పరిష్కరిస్తారా? లేదా ఏదైనా జరగకూడదని జరిగితే సంయమనంతో నిగ్రహంగా ఉండగలరా? తమ వారిని సంయమనంగా ఉంచగలరా? విగ్రహాలను ధ్వంసం చేసారని స్వచ్ఛంగా, కల్మషం లేకుండా జీవించే పల్లెటూర్లలోనే విధ్వంసాలు జరుగుతుంటే.. మద్యం మత్తుల్లో రోజుకో గొడవ.. పూటకో తగదా జరిగే ఈ ప్రాంతంలో శాంతి భద్రతలకు పూచికత్తు ఎవరు తీసుకుంటారు? అనే ఎన్నో ప్రశ్నలు స్థానిక ప్రజల మనస్సుల్లో, వారి మాటల్లో వినిపిస్తోంది.


గీతానగర్ కరకట్ట వద్ద రాత్రికి రాత్రే ఏర్పాటైన దివంగత మహానేత వంగవీటి మోహనరంగా విగప్రాం (ప్రారంభానికి సిద్ధంగా ఉంది)


రాణిగారితోట గుడ్ మార్నింగ్ సెంటర్‌లో ప్రారంభానికి సిద్ధమైన దివంగత మహానేత వంగవీటి మోహనరంగా విగప్రాం



సోమవారం బాలాజీనగర్ ప్రాంతంలో ఖరీదైన పేవర్ బ్లాక్‌ల రాళ్లను ఏర్పాటు చేస్తున్న కార్మికులు

### మందుబాబుల చేసిన పనికి తనకున్న స్థానిక యువకులు

కొంత కాలం క్రితం ఇదే ప్రాంతంలో మందుబాబులు తప్ప తాగి ఎవరు లేని సమయంలో బ్యానర్లు చించడం వలన ఎన్నో గొడవలు అయ్యాయి.. స్టేషన్ వరకు కూడా ఈ పంచాయతీలు చేరాయి. తరువాత పోలీసులు రంగంలోకి దిగి వారిని శాంతిపరిచి సమస్యను పెరగనివ్వకుండా చర్యలు తీసుకున్నారు. ఇలాంటివి ఈ ప్రాంతంలోనే అనేకం కూడా జరిగినట్లు తెలియవస్తోంది.

### వీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆంతర్యం ఏమిటి?

వీఎంసీ స్థలంలో బోర్డు పెడితే అధికారులు వాటికి తగిన రుసుంను వసూలు చేస్తారు.. లేదంటే ఆ బోర్డులను వెంటనే తొలగింస్తుడడం మనం చూస్తూనే ఉంటాం.. కానీ ఈ మహానేతల విగ్రహాల జోలికి మాత్రం వీఎంసీ అధికారులు రానేరావడం లేదు.. దానికి స్థానిక అగ్రనేతలు ఆ విగ్రహాలను ప్రారంభిస్తుండడం ప్రధాన కారణంగా కనపడుంది.

**ఇప్పుడు పెట్టిన ఆ మహానేతల విగ్రహాలను ఎవరు తొలగించమనడం లేదు కానీ వాటిని ఏర్పరుస్తున్న నేతలే ఆ విగ్రహాల ఆలనా పాలన చూడాలని, వాటికి తగిన రక్షణ వారే కల్పించాలని, ఎటువంటి గొడవలు జరిగే అవకాశం ఉన్నా వాటిని వారే పరిష్కరించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా మంచి పౌరులుగా మెలగాలని ఇక్కడి సామన్య ప్రజలు విగ్రహాలను ప్రతిష్టించే నేతలకు తన విన్నపాలను విన్నవించుకుంటున్నారు.**

# వేములపల్లి రంగనాథ్ కు నివాళులు అర్పించిన విక్కుర్తి...



**మోపిదేవి మేజర్ న్యూస్:**తెలుగుదేశం పార్టీ వీర అభిమాని వేములపల్లి రంగనాథ్ కు ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు నివాళులు అర్పించారు. ఇటీవల రంగనాథ్ ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న విక్కుర్తి శ్రీనివాస్ మోపిదేవి మండలంలోని పెదప్రోలు పంచాయతీలో గల శివరామపురం ( కొత్తూరు ) లోని గృహంలో సోమవారం సాయంత్రం రంగనాథ్ సోదరుడు వేములపల్లి రఘునాథ్, కుమారుడు లిఖిత్ సాయి లను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తొలుత రంగనాథ్ చిత్రపటానికి విక్కుర్తి శ్రీనివాస్ పూలమాలలతో నివాళులు అర్పించారు. రంగనాథ్ మృతి తీరని లోటని ఈ సందర్భంగా శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో వేములపల్లి శ్రీహరి, కిషోర్, మిలటరీ శ్రీను, ప్రముఖ జర్నలిస్టు బాల దుర్గా రామ ప్రసాద్, హొటల్ ప్రసాద్, కస్తూరి విజయ్ కుమార్, విక్కుర్తి రాంబాబు,న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, పులిగడ్డ చంద్ర, రేపల్లె ముసలయ్య,బర్మా బుజ్జీ,బొప్పన రమణ, ఎస్ పున్నయ్య చౌదరి లతో పాటు రంగనాథ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# బేవరేజెస్ కార్పొరేషన్ డీజీఎం కృష్ణ ప్రసాద్ పదవీ విరమణ





**విజయవాడ మేజర్ న్యూస్ :** ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీబీసీఎల్) డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం- పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్) అడుసుమిల్లి వెంకట కృష్ణప్రసాద్ సోమవారం పదవీ విరమణ చేశారు. మంగళగిరిలోని కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెంకట కృష్ణప్రసాద్‌కు డైరెక్టర్ - ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్ దేవ్ వర్మ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. 1989లో ప్లాంట్ సూపర్వైజర్‌గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి, అనంతరం అసిస్టెంట్ మేనేజర్ పదోన్నతి పొంది 2018లో నవ్య ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, గుడివాడ డిపోల అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి ఆపై డీజీఎంగా అత్యుత్తమ సేవలు అందించారని కార్పొరేషన్ సిబ్బంది ప్రశంసించారు. కార్యక్రమంలో ఏపీ బీసీఎల్ జనరల్ మేనేజర్ కేవీ స్వామి, డీజీఎం శరణ్ కుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెండు సరికొత్త ఉత్పాదనలైన వాలెక్సియో, మిబెల్యా ఆవిష్కరించిన బీఏయస్‌ఎఫ్




**విజయవాడ మేజర్ న్యూస్ :** నగరంలోని ఓ హోటల్‌లో వ్యవసాయ ఉత్పత్తుల లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జర్మనీకి చెందిన కంపెనీ బీఏయస్‌ఎఫ్ అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించబడిన రెండు సరికొత్త ఉత్పాదనలైన వాలెక్సియో, మిబెల్యా లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా బిఎయస్యఫ్ రీసెర్చ్ & డెవలప్మెంట్ సౌత్ ఆసియా హెడ్ నీలాంజన్ సన్యాల్, బిజినెస్ యూనిట్ లీడ్ రమేష్ బాబు, మార్కెటింగ్ మేనేజర్ భార్గవరెడ్డి, ఫీల్డ్ బయాలజిస్ట్ ప్రమోద్, బిజినెస్ డెవలప్మెంట్ లీడ్ మనోజ్ కుమార్, టెరిటరి మేనేజర్ వినయ్ ప్రభాత్, డిస్ట్రిబ్యూటర్ సాయిదుర్గా ఆగ్రో ఏజెన్సీస్ మాలెంపాటి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బిఎయస్యఫ్ రీసెర్చ్ & డెవలప్మెంట్ సౌత్ ఆసియా హెడ్ నీలాంజన్ సన్యాల్ మాట్లాడుతూ మొదటి ఉత్పాదనైనా వాలెక్సియో కీటకనాశిని వరి పంటలో సుడిదోమపై దీర్ఘకాలం అత్యంత శక్తివంతంగా పనిచేస్తుందని తెలిపారు. సుదీర్ఘకాలం నమ్మకమైన నియంత్రణ కలిపిస్తుందని మొక్క ఎదుగుదల సర్వోత్తమముగా ఉండడాన్ని పెంపొందిస్తుందని వివరించారు. బిజినెస్ యూనిట్ లీడ్ రమేష్ బాబు మాట్లాడుతూ రెండవ ఉత్పాదనైన మిబెల్యా శిలీంద్రనాశిని గురించి వివరిస్తూ వరి పంటలో వచ్చు పాముపొడ తెగులు నుండి దీర్ఘకాలం రక్షిస్తుందని అలాగే ఉత్పాదక పిలకల శాతాన్ని పెంచే సామర్థ్యాన్ని మొక్కకి అందిస్తుందని తెలిపారు. మార్కెటింగ్ మేనేజర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ వాలెక్సియో మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా భారతదేశంలో తయారైతుందని తెలిపారు. అలాగే వాలెక్సియో డోస్ 60 మి.లి/ఎకర, మిబెల్యా డోస్ 120 మి.లి/ఎకర గా పేర్కొన్నారు.

# ఈసెట్ కౌన్సెలింగ్ నిర్వహణపై విమర్శించడం జగన్ అజ్ఞానానికి నిదర్శనం

## టి.ఎన్.ఎస్.ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్




**విజయవాడ మేజర్ న్యూస్ :** ఒక రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అత్యంత ముఖ్యమైన రంగం విద్యారంగం. అలాంటి విద్యారంగాన్ని జగన్ హయంలో పూర్తి భ్రష్టుపట్టించి, లక్షలాది మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు తరలించేందుకు ప్రయత్నాలు జరిగాయి. విద్యావ్యవస్థ పై ఎలాంటి అవగాహన లేని ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ ఈసెట్ కౌన్సెలింగ్ నిర్వహణపై విమర్శలు చేయటం ఆయన అజ్ఞానానికి నిదర్శనమంటూ టి.ఎన్.ఎస్.ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్ తీవ్రంగా మండి పడ్డారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఈసెట్ కౌన్సెలింగ్ జాప్యం చేస్తోందంటూ ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ చేసిన వ్యాఖ్యలను టి.ఎన్.ఎస్.ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్ తీవ్రంగా ఖండించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ రెడ్డి ఈ సెట్ కౌన్సెలింగ్ 2022లో సెప్టెంబరులో ఆలస్యంగా ఎందుకు నిర్వహించాడో సమాధానం చెప్పాలంటూ ఎమ్మెల్యే జగన్ ను చరణ్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో పి.చరణ్ సాయి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కి విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యమంటూ, జూలై మూడో వారంలోపు ఈ సెట్ కౌన్సిలింగ్ ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. రాష్ట్రంలో అస్తవ్యస్తం చేసిన విద్యా వ్యవస్థను మంత్రి నారా లోకేష్ గాడిన పెడుతున్నందుకే ఎమ్మెల్యే జగన్ కి కడుపు మంట పెరిగిపోయి బురద జల్లే కార్యక్రమాలు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. వజ్జీ ఆడుతూ చిప్ పోయిన వైసిపి ఎమ్మెల్యే జగన్ కు ఈసెట్ కౌన్సెలింగ్ ఎప్పుడు జరుగుతుందో, అసలు ఈ కౌన్సెలింగ్ కు ఎవరు హాజరవుతారనే అవగాహన కూడా వుండకపోవచ్చునన్నారు. ఎన్డీయే కూటమిలో విద్యార్థులకు సంబంధించిన అర్హత పరీక్షలన్నీ సమయానికే జరుగుతున్నాయని... ఆ విషయం ఎమ్మెల్యే జగన్ గ్రహించాలని హితవు పలికారు. ఎమ్మెల్యే జగన్ కి తెలిసింది ఒక్కటే లాక్కోవటం..దోచుకోవటం...లేదా శవరాజకీయాలు చేయటం అంటూ విమర్శించారు. తన కారు కింద పడి సింగయ్య అనే వ్యక్తి మృతి చెందితే కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించటానికి కూడా వెళ్లలేదంటూ మండిపడ్డారు. జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 475 కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిలిపివేస్తే...రాష్ట్ర మంత్రి నారా లోకేష్ 475 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సన్నబియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నాడన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనమే కాదు...స్కూల్ యూనిఫాం దగ్గర నుంచి స్కూల్ బ్యాగ్ వరకు నాణ్యమైనవి అందించారు. వాటిపై ఫోటోలు వేయించలేదని ఎద్దేవా చేశారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు గురించి మాత్రమే ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.చిన్న పిల్లలు తినే గుడ్లు , చిక్కిల్లో 200 కోట్లు దోచుకున్న జగన్, నాడు -నేడు పేరు చెప్పి ఎంత దోచుకున్నాడో చెప్పాలంటూ ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టారన్నారు.

మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్- టీచర్ మీట్ నిర్వహించటంతో పాటు, విద్యావ్యవస్థలో తీసుకువచ్చిన అనేక మార్పులతో విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాల గేట్లకు నో అడ్మిషన్లు బోర్డులు తగిలించే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చేందు ప్రతి పాఠశాలలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారికి కావాల్సిన విధంగా సిలబస్‌లో మార్పులు తీసుకువచ్చారన్నారు. పాలిటెక్నిక్ లో ఏ.ఐ టెక్నాలజీ తీసుకువచ్చి అనేక మంది విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చూసి జగన్ కి ఓర్వలేనితనం పెరిగిపోయిందని అందుకే ఇలాంటి పిచ్చి పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నాడన్నారు. జగన్ తన వైఖరి మార్చుకోకపోతే విద్యార్థులతో పాటు ప్రజలు బుద్ధి చెప్పటానికి సిద్ధంగా వున్నారని హెచ్చరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న టి.ఎన్.ఎస్.ఎఫ్. పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు డి. గణేష్, బి.సూర్యకుమార్,కిషోర్, రాజేష్ పాల్గొన్నారు.

# సామ్‌సంగ్ భావి తరపు గెలాక్సీ ఫోల్డబుల్స్ కోసం ముందస్తు నమోదు కార్యక్రమం ప్రారంభం




**విజయవాడ మేజర్ న్యూస్ :** తమ భావితరపు ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లను జూలై 9న న్యూయార్క్‌లో సామ్‌సంగ్ విడుదల చేయనుంది. భావి తరపు ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లు కొత్త ఏఐ శక్తితో వస్తాయి. వీటికి అద్భుతమైన హార్డ్‌వేర్ మద్దతు అందిస్తుంది. అధికారికంగా ఈ ఫోల్డబల్స్‌ను విడుదల చేయటానికి ముందుగానే, భారతదేశంలోని కస్టమర్‌లు రూ. 2000 టోకెన్ మొత్తాన్ని చెల్లించడం ద్వారా తదుపరి తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లను ముందస్తుగా రిజర్వ్ చేసుకోవచ్చు. కస్టమర్‌లు సామ్‌సంగ్ డాట్ కామ్, సామ్‌సంగ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్, అమెజాన్, ఫ్లిప్కార్ట్, ప్రముఖ రిటైల్ అవుట్‌లెట్‌లను సందర్శించడం ద్వారా సామ్‌సంగ్ భావితరపు ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లను ముందస్తుగా రిజర్వ్ చేసుకోవచ్చు.

# ఉర్సా క్లస్టర్స్‌లో చేరిన ఇన్విడియా, ఒరాకిల్, ఆర్‌ఎస్‌ఏ ఎగ్జిక్యూటివ్‌లు

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ఏఐ మౌలిక సదుపాయాల ప్లాట్‌ఫామ్ డెవలపర్ ఉర్సా క్లస్టర్స్, తన తదుపరి దశ వృద్ధిని ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సాంకేతిక నాయకుల నియామకాన్ని ప్రకటించింది. కంపెనీ పలు రాష్ట్రాలలో ఏఐ-ఆప్టిమైజ్ చేయబడిన డేటా సెంటర్‌ల నెట్‌వర్క్‌ను నిర్మిస్తుండడంతో, కొత్త నాయకత్వం భారతదేశ ఏఐ పరివర్తనను వేగవంతం చేసేందుకు ప్రపంచ అనుభవాన్ని, లోతైన డొమైన్ నైపుణ్యాన్ని తీసుకువస్తుంది. కొత్త నియామకాలలో ఎరిక్ వార్నర్ ఉండగా, ఆయన చీఫ్ రెవెన్యూ ఆఫీసర్‌గా చేరారు. సన్ మైక్రోసిస్టమ్స్, బీఈఏ సిస్టమ్స్, ఆర్‌ఎస్‌ఏ సెక్యూరిటీలలో నాలుగు దశాబ్దాలకు పైగా ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ నాయకత్వాన్ని తీసుకువచ్చారు. అధిక పనితీరు గల మౌలిక సదుపాయాల కోసం డిమాండ్ పెరుగుతూనే ఉండడంతో, వార్నర్ హైపర్‌స్కేల్ క్లౌడ్ ప్రొవైడర్లు, ఏఐ-ఫస్ట్ ఎంటర్‌ప్రైజెస్‌లతో కంపెనీ వాణిజ్య భాగస్వామ్యాలకు నాయకత్వం వహించనున్నారు.

# 104 వాహనం ద్వారా కొత్త ఎడ్లలంకలో 80 మందికి వైద్య పరీక్షలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ శివారు కొత్త తొమ్మిదవ వార్డులో రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం 104 వాహనం ద్వారా 80 మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. రోగులు అందరికీ షుగర్ వ్యాధి, రక్తపోటు పరీక్షలు నిర్వహించి వారు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వేసవి ముగిసిన వర్షా కాలం రావడంతో వచ్చే సీజన్ వ్యాధులు గురించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జ్వరము ,రక్తహీనత, తదితర రోగులకు సంబంధించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం. పి. శారద ఆధ్వర్యంలో ఎం.ఎల్.హెచ్.పి ఆశా కార్యకర్తలు బి కృష్ణవేణి, ఎం మహిత, డి కృష్ణవేణి, పి సి ఓ పి స్వాతి లు సేవలు అందించారు.

# పాఠశాలకు మిక్సీ విరాళంగా అందజేసిన కొసరాజు




**పామర్రు జూన్ 30 మేజర్ న్యూస్:** స్థానిక శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా పుట్టినరోజు సందర్భంగా పామర్రు మండలం కురుమద్దాలి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు 20వేల రూపాయల విలువగల మిక్సీ, స్టీల్ ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. శని, ఆదివారం పాఠశాలకు సెలవు లు రావడంతో ఆయన సోమవారం పాఠశాలలో వీటిని అందజేశారు.

# అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో సానుకూలంగా పరిష్కరించాలి







**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజలనుండి అందే మీకోసం అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో సానుకూలంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ మీ కోసం కార్యక్రమాన్ని సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, కే ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, అదనపు ఎస్పీ సత్యనారాయణ, మెప్మా పీడీ సాయిబాబు,విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు లతో కలిసి నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.కలెక్టరేట్ లో మొత్తం 169అర్జీలు స్వీకరించారు. అంతకు మునుపు జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై మాట్లాడుతూ ఈసారి ప్రభుత్వం అమలుపరిచే 10 సూత్రాల పథకాలపై శకటాలను తయారు చేయాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయని, ఆ ప్రకారంగా శకటాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఒక్కో సూత్రానికి సంబంధించి ముగ్గురు లేదా నలుగురు జిల్లా అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడే ప్రసంగాన్ని కూడా 10 సూత్రాల అనుసరించి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అందుకు తగిన విధంగానే సంబంధిత జిల్లా అధికారులు వారి కార్యక్రమాలు, పథకాలకు సంబంధించిన వివరాలను సమాచార శాఖ ఉపసంచాలకులకు, సిపిఓలకు అందజేయాలన్నారు.

కోర్టు కేసులకు సంబంధించి ప్రస్తావిస్తూ జిల్లా కలెక్టర్ జలవనరుల శాఖలో 55 కేసులు కోర్టు దిక్కరణ కేసులు ఉన్నాయని, 19 కౌంటర్లు ఇప్పటివరకు దాఖలు చేయలేదని, 6 కేసులకు సంబంధించి వకాలతులు ఇప్పటివరకు దాఖలు చేయలేదని చెబుతూ వెంటనే వాటిని దాఖలు చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖలో కూడా 15 కేసులకు సంబంధించి ఒకటి కూడా కౌంటర్లు దాఖలు చేయలేదని చెబుతూ వెంటనే కౌంటర్లు దాఖలు చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.మహిళా ఉద్యోగుల వేధింపుల నివారణకు కమిటీల ఏర్పాటు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో 10 మంది ఉద్యోగులకు మించి పని చేస్తుంటే తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని మహిళా ఉద్యోగుల పట్ల వేధింపులు జరిగినప్పుడు వాటిపై సమీక్షించాలని సూచించారు. మెప్మా మహిళలకు ట్యాబుల పంపిణీ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మాలో పనిచేస్తున్న మహిళా రిసోర్స్ పర్సన్ లకు జిల్లా కలెక్టర్ పరిపాలన సౌలభ్యం కోసం టాబ్ లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వి పార్వతి, డి ఎఫ్ ఓ సునీత, ఆర్ అండ్ బి ఈఈ లోకేష్, ఉద్యాన అధికారి జే జ్యోతి, మత్స్యశాఖ పశుసంవర్ధక శాఖ అధికారులు చంద్రశేఖర్, చిన్న నరసింహులు, ఐ సి డి ఎస్ పి డి ఎంఎన్ రాణి, డి టి డబ్ల్యు ఓ ఫణి ధూర్జటి, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, సిపి ఓ భీమరాజు, వృద్ధులు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు, పౌరసరఫరాల సంస్థ డిఎం శివరాం ప్రసాద్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ప్రతి ఫిర్యాదుల పరిష్కార వేదికలో 13 ఫిర్యాదులు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వేగంగా, సమర్ధవంతంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రజలు తీసుకువచ్చిన ఫిర్యాదులను, శాఖధిపతులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారులకు తమ స్వయంగా వచ్చి పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని తీసుకొచ్చే విధంగా చూస్తామని తెలియపరిచారు. ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 13 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 4, రెవెన్యూ సంబంధించినవి 1, వైద్య & ఆరోగ్యం 3, ఎస్టేట్ 1, పిఓ యు సి డి 1, హౌసింగ్ 2, సెక్రటరీ 1 మొత్తం కలిపి 13 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి. సత్యకుమారి,పి సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బిసోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## బందరు కాలువ పూడిక తీత పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల జూన్ 30 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం ఫతేలంక గ్రామం వద్ద బందరు కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనులు నాణ్యతా ప్రమాణంతో చేయాలని, నిబంధనలకు అనుగుణంగా పనిచేయడం ద్వారా నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమంలో “79” ఫిర్యాదులు







**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి 13.00 గంటల వరకు ఎన్. టి. ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ నేపథ్యంలో సోమవారం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో ఎన్.టీ.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాలు మేరకు డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయా రాణి, “ప్రజా సమస్యల పరిష్కార వేదిక”(పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 79 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడమైనది. అందిన ఫిర్యాదుల్లో భూవివాదాలకు, ఆస్తి వివాధాలకు, నగదు లావాదేవీలకు సంబంధించినవి 41, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 6, దొంగతనాలకు సంబంధించినవి 2, కొట్లాటకు సంబంధించినవి 4, వివిధ మోసాలకు సంబంధించినవి 5, మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి 5, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు సంబంధించినవి 16, మొత్తం 79 ఫిర్యాదులును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయా రాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించుటలో సహకారాన్ని అందించారు.

## జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 134 అర్జీలు

### నాణ్యతతో గడువులోగా పరిష్కారం చూపాలి : జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ







**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జూన్ 30, మేజర్ న్యూస్ :** జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 134 అర్జీలు వచ్చాయని.. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పోలీసు శాఖకు సంబంధించి 36, రెవెన్యూ శాఖకు సంబంధించి 35, విద్యా శాఖకు 12, మునిసిపల్, పట్టణాభివృద్ధి 11, ఏపీసీపీడీసీఎల్‌కు 5, పంచాయతీరాజ్‌కు 4, మార్కెటింగ్‌కు 3, ఆరోగ్య శాఖకు 3, గ్రామీణ నీటి సరఫరాకు మూడు అర్జీలు వచ్చాయి. సర్వే, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, విభిన్న ప్రతిభావంతులు శాఖ, ఆర్ఐవో, పౌరసరఫరాల విభాగాలకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. ఉద్యాన శాఖ, ప్రభుత్వ పాలిటెక్నిక్, వ్యవసాయం, డీఆర్‌డీఏ, డ్వామా, బీసీ కార్పొరేషన్, ఇరిగేషన్, గ్రామ వార్డు సచివాలయాలు, దేవాదాయ, మైన్స్ అండ్ జియాలజీ, కాలుష్య నియంత్రణ మండలి, నీటి వనరులు విభాగాలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. రీ ఓపెన్ కాకుండా ప్రజా సమస్యల దరఖాస్తులను పరిష్కరించాలని.. ఇందుకు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సిఎస్ఆర్ నిధుల మంజూరుకు అంచనాలు తయారు చేయాలి

**జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలోని వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి కార్పొరేట్ సామాజిక బాధ్యత సిఎస్ఆర్ నిధులు మంజూరుకు అంచనాలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన స్మార్ట్ ఆంధ్రా ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సీఈవో డాక్టర్ ఎన్ నరేష్ తో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సిఎస్ఆర్ నిధులు మంజూరుపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ఆసుపత్రులలో మౌలిక వసతుల కల్పన, రక్షిత మంచినీటి పథకాలకు అవసరమైన మరమ్మతులు, దివ్యాంగుల కోసం వీల్ చైర్లు, వినికిడి పరికరాలు, వాకర్లు తదితర అవసరమైన ఉపకరణాలు, మున్సిపాలిటీలకు చెత్తను తరలించే ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు వంటి అవసరాల కోసం ఆయా శాఖల అధికారులు అంచనాలను రూపొందించి నివేదిక సమర్పించాలని సూచించారు. నివేదిక తయారీలో ప్రాధాన్యత పనులను దృష్టిలో ఉంచుకొని తయారు చేయాలన్నారు. ప్రస్తుతం కొన్ని శాఖలు నిధులు మంజూరు కోరుతూ పనులను ప్రతిపాదించాయని, అయితే ప్రాధాన్యత గల పనులను సూచిస్తూ సవరించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. గుడివాడలో తాగునీటి వసతి కల్పనకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ హామీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రక్షిత మంచినీటి పథకాల మరమ్మతులకు అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో సీటీ స్కాన్ పరికరం కొనుగోలు, భవనాలు లేని పాఠశాలల్లో నిర్మాణాలు, మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఆర్టి సెంటర్ భవన నిర్మాణం, పలు పీహెచ్సీలలో అవసరమైన వైద్య పరికరాలు కోసం తక్షణమే ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ ఎస్ భీమరాజు, డీఈఓ పీవీజే రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ కుముదిని సింగ్, నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి చిన నరసింహులు, మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల సంక్షేమమే మా ముఖ్యోద్దేశం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** చిన్న మధ్య తరగతి వ్యాపారులకు తక్కువ వడ్డీతో రుణాలు అందించటమే లక్ష్యంగా బ్రాంచ్ ని విస్తరిస్తున్నట్లు గోదావరి కృష్ణా కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, సీవీఎం చింతా సత్యనారాయణ మూర్తి అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కాంప్లెక్స్ లో గోదావరి కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపబడిన తమ సొసైటీలో డిపాజిటర్లకు, అత్యధిక వడ్డీతో పాటు చిన్న, మధ్య తరహా వ్యాపారులకు తక్కువ వడ్డీతో కూడిన ఋణాలు అందించటమే లక్ష్యంగా సంస్థను స్థాపించినట్లు ఆయన తెలిపారు. సంస్థలో బంగారముపై ఋణాలు , మోర్టిగేజ్ ఋణాలతో పాటు లాకర్ సదుపాయం అందిస్తున్నారని తెలిపారు. చిన్న, మధ్యతరహా వ్యాపారులు కాల్ మనీ బారిన పడకుండా వారి యొక్క ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలనే ముఖ్యోద్దేశంతో సంస్థను స్థాపించినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 12 బ్రాంచిలు ఉన్నాయి,, ఈ రోజు ఇంకొక 11 బ్రాంచిల క్యాంపు ఆఫీస్ లు ఏర్పాటు చేసాము. ఆ 11 బ్రాంచిలు అవనిగడ్డ, బంటుమిల్లి, కైకలూరు, హనుమాన్ జంక్షన్, గన్నవరం, రామవరప్పాడు, భవానీపురం, తిరువూరు, విస్సన్నపేట, జగ్గయ్యపేట, మైలవరంగా తెలియచేసారు. ఈ సొసైటీ త్వరలో మండలానికి ఒక బ్రాంచి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ బ్రాంచిలలో పది వేల మందికి పైగా ఉపాధి కల్పనే ధ్యేయం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరి-కృష్ణ కో ఆపరేటివ్ సోసైటి చల్లపల్లి బ్రాంచ్ మేనేజర్ బుద్ధ మోహన కృష్ణ కిషోర్, అవనిగడ్డ మేనేజర్ నవీన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పదవీ విరమణ చేస్తున్న పోలీస్ సిబ్బందికి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించి ఎలాంటి రిమార్కు లేకుండా, ఆరోగ్యంగా పదవీ విరమణ చెందటం అదృష్టమని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో గల సమావేశ మందిరంలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సభలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందడం అభినందనీయమని, ఇన్ని రోజులు చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించి ఎక్కడ రాజీ పడకుండా శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లకుండా అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. అందరికీ వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎస్పీ ఏఆర్ అడిషనల్ ఎస్పి సత్యనారాయణ , ఇతర పోలీసు అధికారులతో కలిసి ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహుకరించి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం పదవీ విరమణ చెందుతున్న పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులందరితో సరదాగా కొంత సమయం గడిపే వారి కుటుంబ సంగతులను వారి పిల్లల విద్యా విశేషాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ,24 గంటలు ఉద్యోగ విధి నిర్వహణలో ఉంటూ కుటుంబానికి సమయం కేటాయించ లేనప్పటికీ ప్రజాసేవకే మీ సమయాన్ని శక్తిని వినియోగించినందుకు జిల్లా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు. పోలీస్ శాఖలో సుమారు 40 సంవత్సరాల నుండి 43 సంవత్సరాల వరకు విధులు నిర్వర్తించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవీ విరమణ పొందుతున్నారంటే అది భగవంతుడు ఇచ్చిన అద్భుతమైన వరం. మనం పోలీస్ శాఖలోకి ప్రవేశించినప్పుడే మన పదవి విరమణ సమయం తెలిసిపోతుంది. మీరు ఇప్పుడు ఎలా పదవీ విరమణ చెందారో కొంతకాలానికి నేను కూడా రిటైర్ అవుతాను. విధి నిర్వహణలో పదవీ విరమణ అనేది సాధారణం.నిరంతరం క్షణం తీరిక లేకుండా విధుల్లో ఉన్నప్పటికీ మీ పిల్లలను మాత్రం ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది అభివృద్ధి పథంలో నడిపించారు. అందుకు మీకు మీకు సహాయకారిగా ఉన్న మీ జీవిత భాగస్వామికి అభినందనలు. పదవీ విరమణ చెందినప్పటికీ మీరు పోలీస్ కుటుంబ సభ్యులే ఏ సహాయం కావాలన్నా ధైర్యంగా వచ్చి సంప్రదించవచ్చు, అనంతరం పదవీ విరమణ చెందుతున్న సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విందులో ఎస్పీ గారే స్వయంగా వారికి వడ్డించి, వారితో కలిసి భోంచేసి వారితో సమయం గడిపారు.




## అందుబాటులో లేని...
## నందిగామ డివిజన్ విద్యాశాఖ అధికారి

**నందిగామ , జూన్ 30, మేజర్ న్యూస్:** డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కనీసం ఎప్పుడు ఫోన్ చేసినా ఫోన్కి అందుబాటులోకి ఉండరు. కార్యాలయంకి ఎప్పుడు వెళ్ళినా కార్యాలయం క్యాంపు క్లర్క్ సీసీ సమాధానం ఒక్కటే సార్ ఫీల్డ్లో ఉన్నారని చెబుతున్నారు. డివిజన్ పాఠశాలలో పర్యవేక్షణ లేకపోవడంతో విద్య వ్యవస్థ మరున పడుతుంది.డివైఈవో టీచర్స్ కి అందుబాటులో లేక సంతకాలు అవ్వక నానాయాతనలు పడుతున్నారు.సంతకాలు కావాలంటే ఆ ఫైల్ కు సంబంధించిన టీచర్ ఆ ఫైల్ తీసుకొని విజయవాడ మండల విద్యాశాఖ కార్యాలయంకి రావాల్సిందే అని హుకుం జారీ చేశారు. ప్రతి సంతకానికి ఒక రేటు డబ్బులు ఇస్తేనే ఫైల్స్ మీద సంతకాలు పెడతా నంటూ టీచర్లతో డైరెక్ట్గా బేరసారాలు చేస్తున్నట్లు సమాచారం,.టీచర్లకి సెలవులు ఇవ్వాలి అంటే డైరెక్ట్గా వచ్చి విజయవాడ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కలిసి సెలవుకి ఇంతని రేట్ ఫిక్స్ చేసి వెళ్లాలి.ఒక టీచర్ సెలవులో ఉండి తిరిగి జాయిన్ అవ్వాలంటే ఆయనకి డబ్బులు సమర్పించుకోవాల్సిందే అని ఉపాధ్యాయులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. నందిగామ డివిజన్ విద్యా వ్యవస్థనుగాడిలో పెట్టవలసిన అధికారి అందుబాటులో ఉండకుండా బద్ధకంగావ్యవహరిస్తున్నారు.ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు నందిగామ డివై ఈవోని వెంటనే విధుల నుంచి తప్పించాలని పలువురు ఉపాధ్యాయులు, పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

## పేదలకు అందించే ఇళ్లను త్వరితగతిన నిర్మించండి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** పేదలకు అందించే ఇళ్లను త్వరితగతిన నిర్మించాలని, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం అన్నారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని మీటింగ్ హాల్లో కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు, హౌసింగ్, విఎంసి అధికారులతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ కాంట్రాక్టర్లు అందరూ సహకరించాలని త్వరితగతిన ఇళ్లన్నీ పూర్తి చేయాలని అన్నారు. కాంట్రాక్టర్లు, అధికారుల మధ్యలో ఉన్న సమన్వయ లోపం లో ఉన్న సమస్యలను ముఖాముఖి చర్చించడంతో సమస్యలను పరిష్కరిస్తూ, ప్రభుత్వం తరపునుండి వారికి సంపూర్ణ సహాయం అందుతుందని వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటారని అన్నారు. కాంట్రాక్టర్లకు కేటాయించిన ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్స్) పి. సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) విభాగం వెంకట నారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, హౌసింగ్ డిపార్ట్మెంట్ పిడి రజినికుమారి, హౌసింగ్, విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.



## గుడ్లవల్లేరు ఇన్చార్జ్ ఎంపిడిఓగా ఎండీ ఇమ్రాన్



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎండి ఇమ్రాన్ ఇంచార్జ్ ఎంపీడీవోగా నియమకం అయ్యారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. విజయసారధి సోమవారం పదవీ విరమణ చేయడంతో గుడ్లవల్లేరు ఇన్చార్జ్ ఎంపిడిఓగా ఏఓ ఇమ్రాన్ సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది ఇన్చార్జ్ ఎంపిడిఓ ఇమ్రాన్ కు అభినందనలు తెలిపారు.



## సచివాలయంకు కంప్యూటర్ బహుకరణ

**తోట్లవల్లూరు జూన్ 30 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కుమ్మమూరు గ్రామ సచివాలయంకు దాతలు సమకూర్చిన కంప్యూటర్, ప్రింటర్ లను స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా చేతుల మీదుగా అందజేశారు. ఆ గ్రామానికి చెందిన కామినేని జగదాంబ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు నర హరి గ్రామ సచివాలయం కు వీటిని సమకూర్చారు. సోమవారం ఎమ్మె ల్యే కుమార్ రాజా చేతుల మీదుగా వీటిని సచివాలయ సిబ్బందికి అందజే శారు. ఈ సందర్భంగా దాత నరహరిని ఎమ్మెల్యే కుమార్ రాజా అభినందిం చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు వీరపనేని శివరాం, లుక్కా రేణుకారావు, పార్టీ నాయకులు చింత పల్లి వెంకటేశ్వరరావు, రామినేని వెంకట బసవ కుటుంబరావు, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిస్వార్థంతో పనిచేసిన ఉద్యోగులు ప్రజల మనసులలో చిరస్థాయిగా ఉంటారు



**పమిడిముక్కల జూన్ 30 మేజర్ న్యూస్** : అంకితభావంతో నిస్వార్థంగా సేవ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మనసులలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పమి డిముక్కల మండలం చోరగుడి గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తాళ్ళూరి వెంకటరమణ పదవి విరమణ సందర్భంగా స్థానిక పిఎసిఎస్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పంచాయతీరాజ్ శాఖలో 30 సంవత్సరాలకు పైగా సేవలందించిన వెంకటరమణ తన పదవీకాలంలో అందించిన సేవల ద్వారా ఎంతోమంది మన్ననలు పొందారని ఆయన పేర్కొన్నారు. పదవి విరమణ అనంతరం వెంకటరమణ సేవలు సమాజానికి ఉపయోగపడాలని, ఆయన సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణ కుమారి, సుబ్రహ్మణ్యేశ్వర రావు జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, పలు వురు గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొని పదవి విరమణ చేసిన రమణను ఘనంగా సత్కరించారు.

## వైభవంగా కనకదుర్గమ్మకి ఆషాడ సారె సమర్పణ



**నాగాయలంక మేజర్ న్యూస్ :** మండలంలోని నాగాయలంక గ్రామ సమీపంలో గణిపేశ్వరం గ్రామంలో కనకదుర్గమ్మ దేవస్థానం ప్రాంగణంలో ఆషాడ మాసం సందర్భముగా కనకదుర్గాదేవి అమ్మవారికి వైబోగవముగా కావిళ్ళతోనూ108 కేజీల పసుపు కుంకములు ప్రత్యేక ఎడ్ల బండి మీదగా ఊరేగింపుగా ఆలయానికి వచ్చితిరి అనంతరం అమ్మవారికి సారే పట్టు వస్త్రములు విశేష పూజలు ఆలయ ప్రధాన అర్చకులు పోతకూచి సత్యనారా యణ శాస్త్రి ఆధ్వర్యంలో విశేషంగా పూజా కార్యక్రమములు జరిగినవి ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత లేబాక. పద్మప్రియ ఆషాడ సారి సమర్పించినారు కార్యక్రమంలో మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొనితిరి మహిళలకు దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు అన్నదానము చేసినారు.

# ప్రజలకు మరింత దగ్గరగా పల్లెనిద్ర



జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు, ఆదేశాల మేరకు, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో సత్సం బంధాలు మెరుగుపరచేందుకు, పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ అధికారులు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో రాత్రి సమయంలోనే బస చేస్తూ, ప్రజలతో చర్చలు నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుంటున్నారు.గ్రామాల అంతర్గత శాంతి భద్రతలు, ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకోవడం, పోలీసింగ్‌ను ప్రజలకు మరింత దగ్గర చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని క్రమంగా విస్తరిస్తూ, పోలీస్, ప్రజల మధ్య పరస్పర విశ్వాసాన్ని పెంపొందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. నేరాల నివారణ, మహిళల భద్రత, యువతకు మార్గనిర్దేశం వంటి అంశాలపై గ్రామస్థులతో చర్చలు జరిపి, వారి అభిప్రాయాలను కూడా తెలుసుకుంటున్నారు. పోలీసింగ్‌లో పారదర్శకత పెరిగి ప్రజలకు నమ్మకం కలిగేలా పల్లెనిద్రలు ఉపయోగపడతాయని, పోలీస్ వ్యవస్థ ప్రజల కోసం పని చేస్తుందన్న నమ్మకాన్ని ఈ కార్యక్రమం కలిగించనుంది" అని పోలీస్ అధికారులు తెలియజేశారు.







## డివైడర్ ను డీ కొని ఇద్దరు వ్యక్తులు దుర్మరణం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** డివైడర్ ను ఢీకొని ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన మచిలీపట్నం నగర పరిధిలోని 31 వ డివిజన్ శారదానగర్ వడ్డిరంగారావు విగ్రహం వద్ద సోమవారం జరిగింది.విషయం తెలుసుకున్న ఇనకుదురు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వక వ్యక్తి చిన్నాపురం గ్రామానికి కి చెందిన దాలిపర్తి పవన్ (23)గా గుర్తించారు, ఇంకొక వ్యక్తి కోడూరు కు చెందిన వాడని వివరాలు తెలియాల్సి ఉందన్నారు.వీరిద్దరూ గౌతమ్ ట్రావెల్ద్ లో క్లీనర్ గా పని చేస్తున్నారని అంటున్నారు.

## ఎస్.ఎఫ్.ఐ.ఆల్ ఇండియా కమిటీ సభ్యురాలిగా షేక్ జాహిదా



**నందిగామ, జూన్ 29, మేజర్ న్యూస్:** నియోజకవర్గం కంచికచర్ల గ్రామంలో పేద కుటుంబంలో జహీదా జన్మించారు జగ్గయ్యపేట ఎస్.జి.ఎస్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసారు.గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎయిడెడ్ విద్యాసంస్థలన్ని ప్రైవేటు చేస్తున్న సందర్భంలో (నందిగామ లొ కె.వి.ఆర్ కాలేజి, జగ్గయ్యపేట ఎస్. జి.ఎస్ కాలేజీ) ఎస్.జి.ఎస్. కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో ఎయిడెడ్ కొనసాగించాలని ఎస్.ఎఫ్.ఐ చేస్తున్న ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తర్వాత ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలుగా జిల్లా గర్ల్స్ కన్వీనర్ గా కొనసాగుతూ హాస్టల్లో విద్యార్థుల సమస్యలపై ఉపకార వేతనాలు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పైన పెండింగ్ స్కాలర్ షిప్ లపై ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ విజయవాడ కే.బీ.ఎన్ కళాశాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేశారు.ఈనెల 27 నుంచి 30 తేదీ వరకు కేరళలో జరుగుతున్న జాతీయ మహాసభల్లో ఆలిండియా కమిటీ సభ్యురాలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఆంధ్ర బ్యాంకులో గోరిపర్తి సేవలు మరోవలేనివి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్ర బ్యాంకు ఎంప్లాయిస్ కోపరేటివ్ బ్యాంకులో వివిధ స్థాయిల్లో 35 సంవత్సరాలు సేవ చేసిన గోరిపర్తి వెంకటేశ్వరరావు పదవీ విరమణ వీడ్కోలు సభ సోమవారం సాయంత్రం బ్యాంకు ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్థాపించిన ఆంధ్ర బ్యాంకులో 35 సంవత్సరాలు పదవీ బాధ్యత నిర్వహించి పదవికి వన్నెతెచ్చిన గోరిపర్తి వెంకటేశ్వరరావు సేవలు నిరూపమానమని అన్నారు. బ్యాంకింగ్ సేవలో కస్టమర్లకు అభిమానాన్ని పొందిన మేనేజర్ గా గోరిపర్తి ఆంధ్ర బ్యాంకు రికార్డులో తన పేరు నమోదు చేసుకున్నారని బాలాజీ అన్నారు. విశ్రాంత చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గౌరిపర్తి ఉద్యోగ నిర్వహణలో తోటి ఉద్యోగులకు ఆదర్శప్రాయం అని అన్నారు. నిరంతరం బ్యాంకు అభివృద్ధికి కృషి చేసిన వెంకటేశ్వరరావు కస్టమర్లు అభిమానాన్ని పొందారని అన్నారు. ఈ



కార్యక్రమంలో మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొనకళ్ళ రాధాకృష్ణ నూతన బ్రాంచ్ మేనేజర్ మేక సోమశేఖర్ ఇతర సీనియర్ కస్టమర్లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో లేడీ యాంప్తుల్ కళాశాల అధ్యాపకులు లంకిశెట్టి హరినాధ్ బాబు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# అమెరికాలో సిలికాన్ వ్యాలీ - అమరావతిలో క్వాంటం వ్యాలీ








**విజయవాడ, జూన్ 30 మేజర్ న్యూస్ :** అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంటే అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2026 జనవరి 1 నాటికి క్వాంటం వ్యాలీ ప్రారంభం అవుతుందని ఆయన వెల్లడించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ భాగస్వామ్యంతో ఈ క్వాంటం వ్యాలీ పార్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీపై ఏర్పాటు చేసిన నేషనల్ వర్క్ షాప్‌కు సీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విజయవాడలో నిర్వహించిన నేషనల్ వర్క్ షాప్‌కు ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన ప్రముఖ బహుళ జాతి సంస్థల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు వివరించారు. క్వాంటం కంప్యూటింగ్‌ను భారత్ అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వర్క్ షాప్‌లో సీఎం మాట్లాడుతూ " నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఐటీ పరిశ్రమ విస్తరిస్తోంది. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ను కలిసి ఐటీ విస్తరణపై చర్చించా. పీపీపీ విధానంలో హైటెక్ సిటీ కట్టాలని ఎల్ అండ్ టీని కోరాను. ఆ తర్వాత ఆ సంస్థ బెంగుళూరు, గురుగాంవ్‌లోనూ ఐటీ భవనాలు కట్టింది. భవిష్యత్ లో భారత్ అతిపెద్ద ఐటీ హబ్ గా మారుతుందని అప్పుడే చెప్పాను. ఉమ్మడి ఏపీలో ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశాను. రాజధాని అమరావతికి అనేక ఐటీ సంస్థలు వస్తున్నాయి. అధునాతన సాంకేతిక కేంద్రంగా అమరావతిని మారుస్తాం. అమరావతికి రావాలని స్టార్టప్ కంపెనీలను ఆహ్వానిస్తున్నాం" అని సీఎం చంద్రబాబు వివరించారు.

**2026 జనవరికి అమరావతిలో క్వాంటం వ్యాలీ**

నేషనల్ క్వాంటం మిషన్‌ను కేంద్రం ప్రకటించిన వెంటనే అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ లాంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. "క్వాంటం వ్యాలీ పార్క్ కు అనుబంధంగా పూర్తిస్థాయి ఎకో సిస్టమ్ ఏర్పాటు చేసి, వందకు పైగా యూజ్ కేసెస్ ను పరీక్షిస్తాం. ఓ మిషన్ తీసుకువచ్చి అమరావతికి క్వాంటం కంప్యూటర్ వచ్చేసింది అనుకోవటం లేదు. వివిధ ఉపకరణాల నుంచి రియల్-టైమ్ డేటా విశ్లేషణకు, వ్యవసాయంలో మట్టి తేమ వంటి అంశాలను పర్యవేక్షించడానికి క్వాంటం కంప్యూటింగ్ అవసరం. క్వాంటం టెక్నాలజీ, డీప్ టెక్నాలజీ, ఏఐలు ఇప్పుడు సరికొత్త సాంకేతిక విప్లవం. ఈ రంగాల్లో ఏపీకి కొన్ని సానుకూలతలు ఉన్నాయి. ఏపీలో స్పేస్ సిటీ, స్పేస్ టెక్నాలజీ, డిఫెన్స్, ఎరో స్పేస్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో చాలా అవకాశాలు ఉన్నాయి. ఏపీలో ప్రభుత్వ సేవలను వాట్సప్ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 15 నుంచి వందశాతం పౌరసేవలు వాట్సప్ ద్వారానే అందిస్తాం. డేటా లేక్‌పై ఏపీ ప్రస్తుతం పనిచేస్తోంది. పౌరుల నివాసాలు జియో ట్యాగింగ్, సర్వీస్ డెలివరీ, ఆన్ లైన్ ఫైల్స్, క్లౌడ్ డేటాలను పాలనలో వినియోగిస్తున్నాం. సీసీ కెమెరాలు, సెన్సార్లు, వేరబుల్స్ ద్వారా రియల్ టైమ్ డేటా వస్తోంది. వీటిని విశ్లేషించాలంటే క్వాంటం కంప్యూటింగ్ అవసరం. వ్యవసాయ రంగంలో భూమిలో తేమ, ఎరువుల వినియోగం లాంటి అంశాలను కూడా క్వాంటం కంప్యూటింగ్ తో అనుసంధానిస్తే అద్భుతాలు చేయొచ్చు. క్వాంటం టెక్నాలజీలో స్టార్టప్‌లు కూడా వస్తే అవకాశాలు విస్తృతం అవుతాయి. ఫార్మా రంగంలోనూ, వ్యక్తుల ఔషధ వినియోగం వంటి వాటిపై కూడా పరిశోధనలు సాగించవచ్చు. క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతను మరో స్థాయికి చేరుస్తుంది" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**క్వాంటం టెక్నాలజీలో పెట్టుబడులు, స్టార్టప్‌లకు ఆహ్వానం**

క్వాంటం రంగంలో స్టార్టప్‌లు రావడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఆవిష్కరణకు ఆకాశమే హద్దు అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి సహా ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమలు, స్టార్టప్‌లకు సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఈ మూమెంటంలో బహుళజాతి కంపెనీలు భాగస్వాములు కావాలి. ఇప్పుడే పెట్టుబడులతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది. భారత్‌లోనే ఉత్పత్తులు తయారు చేసి ఇక్కడి మార్కెట్‌ను వినియోగించుకోవాలి. ఏపీలోనూ వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్‌ను తయారుచేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నాం. పాలనలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం తీసుకురావడానికి ఐటీ ఒక్కటే మార్గమని బలంగా విశ్వసించాను. హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించడం ద్వారా ఒక బలమైన ఐటీ ఎకోసిస్టమ్‌ను సృష్టించాం. ఫలితంగా ఇప్పుడు సైబరాబాద్ ప్రపంచ ఐటీ కేంద్రంగా మారిందని గుర్తుచేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. అమరావతి క్వాంటం వ్యాలీ దేశానికి మార్గనిర్దేశనం చేయాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**క్వాంటం టెక్నాలజీ విజన్ లక్ష్యాలను మంత్రి లోకేష్ సాధించాలి**

కార్నెగీ మెలన్ యూనివర్సిటీలో చదువుకున్న నారా లోకేష్ ఐటీ శాఖ మంత్రిగా ఉండటం సంతోషదాయకమని గతంలో ఈ శాఖను గ్రాడ్యుయేషన్ చదువుకున్నవారు నిర్వర్తించారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. లోకేష్‌కు క్వాంటం వ్యాలీ ద్వారా ఒక విజన్ లక్ష్యాలను సాధించే బాధ్యతను అప్పగించానని ముఖ్యమంత్రి తెలిపారు. తాను నిత్య విద్యార్థినని, భవిష్యత్ టెక్నాలజీని పాలనకు, అభివృద్ధికి ఎలా సమ్మిళితం చేయాలన్నదే తన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ లక్ష్యాలను కేంద్ర ప్రభుత్వం సహకారంతో సాధిస్తామని ఆయన అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ప్రోటోటైప్‌ను ఐబీఎం నేషనల్ వర్క్ షాప్‌లో ప్రదర్శించింది. నేషనల్ వర్క్ షాప్‌లో భాగంగా ఏర్పాటు చేసిన క్వాంటం టెక్నాలజీ స్టార్టప్‌లను మంత్రి లోకేష్‌తో కలిసి సీఎం పరిశీలించారు.



## హర్యానాలో జాతీయ సమావేశాలకు చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి

నందిగామ, జూన్ 29, మేజర్ న్యూస్:కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో "రాజ్యాంగం, సదస్సుకు రాష్ట్రం నుంచి హాజరుకానున్న నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొనడం జరుగుతుంది అని మునిసిపల్ కమిషనర్ తెలిపారు. ఈ సదస్సు జూలై 3, 4 తేదీల్లో హర్యానాలోని , గురుగ్రామ్ లో భారత పార్లమెంటు హర్యానా ప్రభుత్వ సహకారంతో.. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పట్టణ స్థానిక సంస్థల చైర్మన్ లకు ఈ సదస్సు పై అవగాహన కల్పించడం కోసం రెండు రోజులు జాతీయ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు ఏపీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లను నామినేట్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి కు అవకాశం దక్కింది. వీరందరికీ నోడల్ ఆఫీసర్ గా రాజమండ్రి మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ నాగ నరసింహా రావు వ్యవహరించనున్నారు అని తెలిపారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్.జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి ది.30.06.2025 తేదిన పదవీ విరమణ చేసిన 16 మంది పోలీస్ అధికారులను పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఇతర పోలీస్ అధికారులతో కలిసి సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందించినందుకు గాను పదవీ విరమణ చేసిన అధికారులు డి.సి.పి.ట్రాఫిక్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు ఎం.కృష్ణ మూర్తి నాయుడు , సి.ఎస్.బి. సబ్‌ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు ఎల్.నాంచారయ్య, అజిత్ సింగ్ నగర్ సబ్‌ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు జి.జె.ఆనందరావు, పి.సి.ఆర్. సబ్‌ఇన్స్పెక్టర్‌లు కె.విజయ కుమార్, ఎం.వై.వి. రమణ ప్రసాద్ బాబు, కృష్ణ లంక క్రైమ్. సబ్‌ఇన్స్పెక్టర్ ఏ.సూర్య నారాయణ, సి.ఎస్.బి. సబ్‌ఇన్స్పెక్టర్ కె.శివ నాగేంద్ర కుమార్ , సి.ఎస్.బి. సబ్‌ఇన్స్పెక్టర్ బి.ఎ.ఎస్. స్వర్ణ కుమారి, పి.సి.ఆర్. అస్సిస్టెంట్ సబ్‌ఇన్స్పెక్టర్ కె.బుజంగ రావు, మాచవరం అస్సిస్టెంట్ సబ్‌ఇన్స్పెక్టర్ వై.నారాయణ రావు, సి.ఎ.ఆర్.అస్సిస్టెంట్ రిజర్వ్ సబ్‌ఇన్స్పెక్టర్ లు ఎం.వేంకటేశ్వర రావు, ఆర్.వి.రమణ, వి.శివ గోపాల్, బి.దుర్గాప్రసాద్, నందిగామ హెడ్ కానిస్టేబుల్ బి.సుధీర్, హోంగార్డు కె.వేంకటేశ్వర రావు లను అభినందించి పోలీస్ మర్యాదలతో శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికినారు. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు మాట్లాడుతూ... పధవీ విరమణ చేస్తున్న అధికారులంధరికి వారి కుటుంబ సభ్యులకు ధన్యవాధములు తెలియజేశారు. ఈ నేపధ్యంలో ప్రతి ఒక్క అధికారిని, వారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. పధవీ విరమణ చేసిన అధికారులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 24 గంటలూ ఉద్యోగ వీధి నిర్వహణలో బాగంగా చాలా బిజీగా గడిపారు. ఇప్పటి నుండి ఒక్కసారిగా ఖాళీ అయితే చాలా ఇబ్బందిగా ఉంటుంది కనుక అధ్యాత్మిక పరంగా వెళ్లడమో లేధా ఏదో ఒక వ్యాపకం చూసుకోవాలి అని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని తెలియజేశారు. అనంతరం పధవీ విరమణ చేసిన అధికారులను అభినందించి పోలీస్ మర్యాదలతో శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికినారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత, క్రైమ్ డి.సి.పి. కె. తిరుమలేశ్వర రెడ్డి, క్రైమ్ ఎ.డి.సి.పి. ఎం రాజారావు ఎ. ఓ. సునీత, వెల్ఫేర్ ఆర్.ఐ శ్రీనివాసరావు, ఆర్.ఐ. సురేష్ రెడ్డి, ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సోమయ్య, అసోసియేషన్ సంఘ సభ్యులు, అధికారులు, సి.పి.ఓ. సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ఎక్కువ పేరు తీసుకువచ్చిన అంశాల్లో రహదారుల అభివృద్ధి కూడా ఒకటి





**ఆర్ & బీ శాఖ ఈఎన్ సీ పదవీ విరమణ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

**ఆర్ & బీ శాఖపై నేడు ప్రజల్లో మరింత నమ్మకం పెరిగిందన్న మంత్రి**

**నూతన ఈఎన్ సీగా భాధ్యతలు స్వీకరించనున్న వి. రామచంద్రకు మంత్రి అభినందనలు**

**విజయవాడ బ్యూరో, జూన్ 30, మేజర్ న్యూస్ :** గత ఏడాది పాలనలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అత్యంత ఎక్కువ పేరు తెచ్చిన కీలకమైన అంశాలలో రహదారులు అభివృద్ధి ఒకటని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.. నేడు విజయవాడలోని ఆర్ & బీ కార్యాలయంలో ఆ శాఖ ఈ ఎన్ సీ నయిముల్లా, ఆర్ & బీ క్వాలిటీ కంట్రోల్ ఛీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు పదవీ విరమణ ఆత్మీయ అభినందన సభలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేడు రిటైర్ కాబోతున్న ఈఎన్ సీ నయిముల్లా, సీఈ వెంకటేశ్వరావులను మంత్రి ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించడం జరిగింది. అలాగే ఆర్ & బీ శాఖ నూతన ఈఎన్ సీ గా బాధ్యతలు స్వీకరించనున్న వి. రామచంద్రను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.. ఈ కార్యక్రమంలో ఆర్ & బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఏపీఆర్డీసీ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరావు, ఆర్డీసీ ఎండీ ఎల్. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. నేడు, రేపు నియోజకవర్గంలో ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నప్పటికీ, మన ఆర్ & బీ శాఖ కుటుంబ సభ్యులకు సంబంధించి రిటైర్ మెంట్ కార్యక్రమం జరుగుతున్న క్రమంలో ఇక్కడకు రావడం జరిగిందన్నారు.. గత ఏడాది నేను నూతనంగా ఆర్ & బీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ.. ఆర్ & బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఈఎన్ సీ నయిముల్లాలతో కలిసి సమన్వయంతో పనిచేస్తూ ఆర్ & బీ శాఖ పురోగతికి పనిచేశామన్నారు.. నేడు ప్రభుత్వానికి గతేడాది పాలనలో అత్యంత పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన అంశాల్లో రోడ్ల మరమ్మతులు, రహదారులు అభివృద్ధి కూడా ఒకటని మంత్రి తెలిపారు.. ముఖ్యంగా గత ప్రభుత్వంలో గుంతలు పడి అతి దారుణంగా మారిన రోడ్లను మన ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఒక ఛాలెంజ్ తీసుకుని గుంతలు పూడ్చడం జరిగిందన్నారు. సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయడంలో ఆర్ & బీ శాఖ అధికారుల పాత్ర కీలకమన్నారు.. దీంతో నేడు ప్రజల్లో సైతం ఆర్ & బీ శాఖపై మరింత నమ్మకం పెరిగిందన్నారు.. ఆర్ & బీ శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారులు వరకు అంతా కలిసి సమన్వయంతో ముందుకు సాగడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్ & బీ శాఖకు మంచి పేరు వస్తోందన్నారు. నేడు రిటైర్ అవుతున్న ఉన్నతాధికారులు భవిష్యత్తులో కుటుంబంతో కలిసి ప్రశాంత జీవితం కొనసాగించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.. అదే సమయంలో వారి అనుభవం దృష్ట్యా, వారి విలువైన సూచనలు, సలహాలను భవిష్యత్తులో ఆర్ & బీ శాఖలో అవసరమైనప్పుడు వాడుకుంటామని మంత్రి తెలిపారు.

# రైతులకు సకాలంలో సాగునీరు అందేలా చర్యలు

**ఎమ్మెల్యే కుమార్ రాజా**



**తోట్లవల్లూరు జూలై 30 మేజర్ న్యూస్ :** రైతులకు సకాలంలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలం కుమ్మమూరు గ్రామం వద్ద బందరు కాలువ నుండి కుమ్మమూరు కాలువకు ఏర్పాటు చేసిన డ్రాప్ ను ఆయన ప్రారంభించారు. గతంలో మరమ్మతులకు గురైన ఈ డ్రాప్ ను ఏర్పాటు చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో రైతులు సకాలంలో నిరందక తీవ్ర ఇబ్బందుల కు గురయ్యారని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన వెంటనే రైతుల సమస్యలను గుర్తించి కాలు వల మరమ్మతులు చేపట్టామని తెలిపారు. దీనిలో భాగంగా కుమ్మమూరు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డ్రాప్‌ను ఈరోజు ప్రారంభించడం జరిగిందన్నారు. రైతులకు ఖరీఫ్ సాగుకు సంబంధించి సకాలంలో సాగునీరు అందించేందుకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. సుమారు 4.5 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన ఈ డ్రాప్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం, ప్రధాన కార్యదర్శి లుక్కా రేణుకా రావు, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు చింతపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు రామినేని వెంకట బసవ కుటుంబరావు, నీటిపారుదల శాఖ డిఇఇ, ఎఇ తదితరులు పాల్గొన్నారు.

# పంట కాలువలకు నీరు విడుదల





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమ పంట కాలువలకు సాగునీరు తాగునీరు విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో సోమవారం మోపిదేవి వార్పు ఎల్ ఎఫ్ ఆర్ వద్ద గేట్లకు పూజలు చేసి కృష్ణమ్మ కు పసుపు, కుంకుమ, పూలు, పళ్ళు, చీర సారే తో పూజలు జరిపి దివిసీమ పంట కాలువలకు నీటిని విడుదల చేశారు. అవనిగడ్డ లాకులు వద్ద రెండు గా చీలి నాగాయలంక కోడూరు కాలువలకు నీరు ప్రవహించింది. ఖరీఫ్ సీజన్ కావడంతో అవనిగడ్డ లోని కొంతమంది రైతులు నారుమరులు పోసేటందుకు సిద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, తూర్పు కృష్ణ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు, నాగాయలంక డిసి చైర్మన్ బండ్రెడ్డి మల్లికార్జునరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బచ్చు కృష్ణకుమారి, బండే కనకదుర్గ పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మిక్సిడ్ డబల్స్‌లో ఆరోన్, వైశాలిలకు స్వర్ణ పతకం

**20వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ టోర్నీ**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** హర్యానాలోని పంచాకులలో 26 నుండి 30 వరకు జరిగిన 20వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు స్వర్ణ పతకం కైవసం చేసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. మిక్సిడ్ డబల్స్ విభాగంలో ఎస్. ఆరోన్ రోనల్ డిన్ హో (అనంతపురం), ఏ.శ్రీ వైశాలి (కృష్ణాజిల్లా)ల జోడి స్వర్ణ పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ ఛాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ బాలుర, బాలికల జట్లు ప్రాతినిత్యం వహించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణ పతకం సాధించిన క్రీడాకారులను అధ్యక్షులు వి.శ్రీనుబాబు, కోశాధికారి బి.నీరజ అభినందనలు తెలిపారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ ఉండాలి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** స్విమ్మింగ్ పూల్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను పాటించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా గాంధీనగర్ స్విమ్మింగ్ పూల్, ధర్నాచౌక్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ శ్రేయ స్థాయి స్విమ్మింగ్ పోటీలు జరుగుతున్నప్పటికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ నిర్వహించాలని, స్విమ్మింగ్ పూల్‌లో వచ్చే ప్రతి ఒక్కరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, షవర్, జిమ్, మరుగుదొడ్ల నిర్వహణ ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని, ఏమైనా మరమ్మతులు ఉన్న చో వెంటనే స్పందించి సత్వరముగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్ ఆవరణ పరిశుభ్రం గా ఉంచాలని, పూల్ ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మొక్కలను పెంచాలని అన్నారు. పోటీలు జరుగుతున్న సమయంలో ప్రేక్షకులు వీక్షించేందుకు గ్యాలరీలు అభివృద్ధి చేయాలని అన్నారు.

ధర్నా చౌక్ లో ఉన్న అన్న క్యాంటీన్ లో పరిశీలించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తూ ఎటువంటి మరమ్మ త్తులో ఉన్న వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ ద్వారా జరుగుతున్న పారిశుధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధాన రహదారులలో మెషిన్లు తరచుగా పారిశుధ్య నిర్వహణ జరిపించాలని అధి కారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీ సర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజనీర్లు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడి) పి. వెంకట నారాయణ, డి.యఫ్.ఒ మాల్యాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, తదితర్లు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, ఏ.కొండూరు, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకటట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999